క్లుప్తంగా

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా మహేందర్ గౌడ్



నియామకపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

చింతలమానెపల్లి: మండలంలోని బాబాసాగర్ గ్రామానికి చెందిన గొడిసెల మహేందర్ గౌడ్ బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు. ఈమేరకు శనివారం బాబాసాగర్ గ్రామంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి దోని శ్రీశైలం, నాయకులు కత్తెర్ల మల్లేశ్, నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం



రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బజార్‌వాడీ మైనార్టీ ఫంక్షన్‌హాల్‌లో శనివారం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 143 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, సింగిల్‌విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, ఎంఎస్‌డబ్ల్యూ అధ్యక్షుడు ఉబేద్‌బిన్ యాహియా, ముబషీర్, అమీర్‌బిన్ అహ్మద్ పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు నవీన్

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎస్‌ఎఫ్‌ఐ 54 ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు నవీన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల సమస్యలపై ఏళ్లుగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తున్నామన్నారు. ఆయన వెంట నాయకుడు హరీశ్, విద్యార్థులు ఉన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో శనివారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి టీమేశ్ స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం జెండా ఎగురవేశారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు శ్రీరాముడి అక్షింతలతో శోభాయాత్ర

ఆసిఫాబాద్: అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం పురస్కరించుకొని ఆదివారం ఉదయం 8.30 గంటలకు జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రామాలయం నుంచి శ్రీరాముడి భారీ విగ్రహం, అక్షింతలతో పట్టణంలో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు శ్రీ రామజన్మ భూమి తీర్థక్షేత్ర ఆసిఫాబాద్ మండల కమిటీ అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి హిందూ బంధువులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

తాత్కాలికంగా పత్తి కొనుగోళ్లు నిలిపివేత

జైనూర్: రెండు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐల ద్వారా పత్తి కొనుగోళ్లను మూడు రోజులపాటు నిలిపి వేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ అహ్మద్‌ఖాన్ శనివారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఆదివారం, సోమవారం సెలవులు ప్రకటించడంతో పాటు పత్తి నిల్వలు మిల్లుల్లో పేరుకుపోవడంతో మంగళవారం సైతం కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులతో ఎంపీపీ మల్లికార్జున్

ఆసిఫాబాద్‌రూరల్: చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను ఎంపీపీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జనవరి 11న గజ్వేల్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరంగా ‘లోహా’

- సరైన రోడ్డు లేక తిప్పలు
- పది రోజులుగా అందని భగీరథ నీరు
- ఇబ్బందుల్లో ఆదివాసీలు



నిరుపయోగంగా వాటర్ ట్యాంకు



లోహా గ్రామం

దహెగాం: ప్రభుత్వాలు మారుతున్నా గిరిజనుల తలరాతలు మాత్రం మారడం లేదు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న అనేక గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని లోహా గ్రామస్తులు సైతం కనీస సౌకర్యాలు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. గ్రామానికి మిషన్ భగీరథ తాగునీరు రాకపోవడంతో ప్రజలు గ్రామంలో ఉన్న బోరు నీళ్లు తాగుతూ కాలం వెళ్లదీస్తున్నారు. గ్రామంలోకి వెళ్లడానికి సరైన రహదారి కూడా లేకపోవడంతో వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

గ్రామంలో 30 కుటుంబాలు..

మండలంలోని మారుమూల గిరిజన గ్రామం లోహాలో సుమారు 30 గిరిజన కుటుంబాలు, సుమారు 130 మంది జనాభా ఉన్నారు. గ్రామస్తుల జీవనాధారం వ్యవసాయం కాగా, సాగు నీరు లేక వర్షాధారంపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. వర్షాకాలంలో మాత్రమే వరి పండిస్తారు. యాసంగిలో జొన్న, పెసర, శనగ తదితర పంటలను సాగు చేస్తున్నారు.

మట్టిరోడ్డే దిక్కు..

కర్జి నుంచి లోహా గ్రామం సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉంది. నాలుగు సంవత్సరాల క్రితం వరకు ఆ గ్రామానికి కాలిబాటనే శరణ్యం కాగా అప్పటి పోలీసుల ఆధ్వర్యంలో లోహా గ్రామానికి పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా రోడ్డు సౌకర్యం కల్పించారు. వర్షాకాలం వచ్చిందంటే రోడ్డంతా బురదగా మారి నడవడానికి కూడా ఇబ్బందిగా మారుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఎన్నాళ్లు మాకు ఈ దుస్థితి అంటూ వాపోతున్నారు. వర్షాకాలంలో రోడ్డుపై ఉన్న చిన్న కల్వర్టులు కొట్టుకుపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. గతంలో గ్రామానికి చెందిన గర్భిణీకి పురిటి నొప్పులు రావడంతో లోహా గ్రామానికి అంబులెన్సు పోలేని స్థితిలో గర్భిణీని ఎడ్లబండిపై తరలించారు.రోడ్డుకు పోలీసులే మరమ్మతులు చేయిస్తున్నారని, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. పోలీసులు రోడ్డు వేసిన సమయంలో అప్పటి కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీలు గ్రామాన్ని సందర్శించి గ్రామాభివృద్ధికి పాటు పడతామని హామీ ఇచ్చినా అమలు కావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

వారం రోజులుగా అందని మిషన్ భగీరథ..

లోహా గ్రామానికి వారం రోజులుగా మిషన్ భగీరథ తాగునీరు అందడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. తాగు నీరు అందక నాలుగేళ్ల క్రితం పోలీసులు ఏర్పాటు చేసిన బోరు బావి నీటిని తాగుతున్నామని పేర్కొంటున్నారు. మిషన్ భగీరథ తాగునీరు పూర్తిస్థాయిలో సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడంతో పాటు, మిషన్ భగీరథ తాగు నీరు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామానికి రోడ్డు వేయాలి



లోహా గ్రామానికి నాలుగేళ్ల క్రితం పోలీసులు రోడ్డు వేశారు. మట్టిరోడ్డు కావడంతో వర్షాకాలంలో రోడ్డంతా బురదగా మారి నడవడానికి కూడా ఇబ్బందిగా ఉంటుంది. చుట్టూ అటవీ ప్రాంతం కావడంతో రాకపోకల సమయంలో భయాందోళన చెందుతున్నాం. నాయకులు స్పందించి బీటీరోడ్డు మంజూరు చేయాలి.

\- మడే సాంబయ్య, లోహా గ్రామం

తాగునీటికి తిప్పలు



మా ఊరికి మిషన్ భగీరథ నీళ్లు సరిగా రావడం లేదు. పోలీసులు ఏర్పాటు చేసిన బోరు బావి నీళ్లు తాగుతున్నాం. వారం రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు వస్త లేదు. సార్లకు చెప్పినా పట్టించుకుంట లేరు. ఎప్పటికీ మాకు ఇదే గోస ఉన్నది. సార్లు దయ చూపి నీళ్లు సరఫరా చేయాలి.

\- తలాండి సురేఖ, లోహా గ్రామం

అభివృద్ధికి అందరూ సహకరించాలి

- పార్టీలకు అతీతంగా పని చేస్తా
- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

బెజ్జూర్: నియోజకవర్గంలో ప్రతీ ఒక్కరు అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలో నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా, పార్టీలకు అతీతంగా పని చేస్తానన్నారు. రాజకీయాలు ఎన్నికలకే పరిమితం చేయాలని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 12 రహదారులు, వంతెనల నిర్మాణానికి అవసరమైన అటవీశాఖ అనుమతుల కోసం అటవీశాఖ ఉన్నతాధికారులతో పాటు మంత్రి కొండా సురేఖకు సైతం నివేదించినట్లు తెలిపారు. కేంద్రం నిధులతో మండలంలో సెల్ టవర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత మొదటిసారిగా మండలానికి రావడంతో మండల బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్థానిక రంగనాయక ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి..

ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు, ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావ్‌తో కలిసి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రోజారమణి, జెడ్పీటీసీ పుష్పలత, సర్పంచ్ అన్సార్ హుస్సేన్, సహకార సంఘం చైర్మన్ ఓంప్రకాశ్, ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, తహసీల్దార్ బ్రహ్మేశ్వర్, ఎంపీడీవో మాధవి, ఎంపీవో రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ..

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ఎల్కపల్లి రైతు వేదికలో 23 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే హరీశ్‌బాబు, ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. రానున్న రోజుల్లో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. జెడ్పీటీసీ సముద్రాల సరిత, సర్పంచ్‌లు కావ్య, రాజన్న, సుధాకర్, శ్రీనివాస్, చంద్రమౌళి, మధునయ్య, ఎంపీటీసీ రాజన్న, కోఆప్షన్ సభ్యుడు సాజీద్, మండల ప్రత్యేక అధికారి రామకృష్ణ, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఏడీఏ రాజులనాయుడు తదితరులు ఉన్నారు.

‘ఆలయ అభివృద్ధికి కృషి’



కోవ లక్ష్మి దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సోనేరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అర్చకులు శిరీష్ శర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుండ వెంకన్న, సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీలకు పనులు కల్పించాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో సురేందర్

దహెగాం: ఉపాధిహామీ పథకంలో భాగంగా పని చేయాలని ముందుకొచ్చే వారికి పని కల్పించాలని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక రైతువేదికలో నిర్వహించిన సామాజిక ప్రజావేదికలో ఆయన పాల్గొన్నారు. అయన మాట్లాడుతూ పని ప్రదేశంలో తప్పనిసరిగా సిబ్బంది ఫొటో తీయాలన్నారు. సామాజిక తనిఖీ వేదికలో పనులు చేయని వారికి డబ్బులు చెల్లించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదనంగా డబ్బులు చెల్లించడం, పని ప్రదేశంలో ఫొటోలు తీయకపోవడం, రికార్డులు చేయక పోవడంపై అసహనం వ్యక్తం చేశారు. దీనికి కారణమైన సిబ్బందికి జరిమానా సైతం విధించారు. 28 మందికి జరిమానా విధించడంతో పాటు రికవరీకి ఆదేశించారు. కాగా ఉపాధి కూలీలు, ప్రజలు లేకుండానే ప్రజావేదిక నిర్వహించడం గమనార్హం. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌పీ కొమురయ్య, అంబుడ్స్ అధికారి సాయిశ్రీ, డీవీవో క్రిష్ణమూర్తి, ఎంపీడీవో రాజేశ్వర్, ఈజీఎస్ ఏపీవో కల్పన, ఉపాధి సిబ్బంది, ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు పాల్గొన్నారు.

విద్యార్థుల కనీస సామర్థ్యాల పెంపునకు కృషి



బ్యాగులు అందజేస్తున్న వెంకట లక్ష్మి

జైనూర్: మారుమూల గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంచాలనే ఉద్దేశంతో రీడ్ టు రూమ్ ఇండియా ట్రస్టు పని చేస్తుందని ఎంఈవో కుడ్మేత సుధాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ పాఠశాలను రీడ్ టు రూమ్ ఇండియా ట్రస్టు బ్లాక్ కోఆర్డినేటర్ వెంకట లక్ష్మితో కలిసి సందర్శించారు. పాఠశాలలోని 4వ, 5వ తరగతి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి కనీస సామర్థ్యాలు అంచనా వేశారు. అనంతరం ట్రస్టు ఆధ్వర్యంలో ఎంఈవో, ఉపాధ్యాయులు, సీఆర్పీలకు బ్యాగులు అందించారు.


పాదయాత్ర భక్తులకు పండ్లు పంపిణీ



భక్తులకు పండ్లు పంపిణీ చేస్తున్న గ్రామస్తులు

చింతలమానెపల్లి: చపరాడకు పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు శనివారం స్థానికుల ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ప్రతి ఏడాది చపరాడకు మంచిర్యాల, కుమురం భీం జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు పాదయాత్ర నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా మండలంలోని రవీంద్రనగర్‌కు చేరుకున్న భక్తులకు బీజేపీ నాయకులు చాప్లె సుధాకర్, సహకార సంఘం డైరెక్టర్ దుబ్బుల మహేశ్‌ల ఆధ్వర్యంలో పండ్లు, పాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చౌదరి చందు, చౌదరి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కూలీల కొరత.. పత్తి రైతు వ్యథ!



దహెగాం: పత్తి ఏరేందుకు కూలీల కొరత కారణంగా పత్తి పంట సాగు చేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు వరి నాట్లు ప్రారంభం కావడంతో పత్తితీతకు కూలీలు దొరకడం లేదు. దీంతో పత్తి ఏరకపోవడంతో చేనుల్లోనే పత్తి పంట దర్శనమిస్తుంది.

మూడోరోజు 23,988 దరఖాస్తులు

ఆసిఫాబాద్: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మూడో రోజు శనివారం జిల్లాలోని 15 మండలాల్లో ప్రజల నుంచి 23,988 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలిపారు. దీంతో దరఖాస్తుల సంఖ్య 43,373కు చేరినట్లు పేర్కొన్నారు.

నేడు అయ్యప్ప పడిపూజ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కేశవనాథ ఆలయ ఆవరణలో ఆదివారం రాత్రి 8.30 గంటలకు అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సమాజ్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ మోతీరాం

కెరమెరి: మండలంలోని మోడి గ్రామంలో కస్తూర్బా గాంధీ (కేజీబీవీ)లో ఇంటర్మీడియెట్ తరగతి గదుల కోసం రూ.3 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న భవన నిర్మాణ పనులను శనివారం ఎంపీపీ పెందోర్ మోతీరాం పరిశీలించారు. పనుల్లో నాణ్యత ఉండాలని, నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు.

సులభ్ కాంప్లెక్స్‌లను వినియోగంలోకి తేవాలి

రెబ్బెన: గోలేటి గ్రామపంచాయతీ పరిధిలోని దుబ్బగూడ, భగత్‌సింగ్‌నగర్‌లలో ఉన్న సులభ్ కాంప్లెక్స్‌లను వినియోగంలోకి తీసుకురావాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయా కాలనీ ప్రజలతో కలిసి సులభ్‌కాంప్లెక్స్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా సులభ్ కాంప్లెక్స్‌లు నిరుపయోగంగా మారాయన్నారు.సర్పంచ్‌తో పాటు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించటం సరికాదని పేర్కొన్నారు. నాయకులు రాజేష్ పాల్గొన్నారు.

దరఖాస్తులు తప్పులు లేకుండా పూరించాలి



దహెగాం: దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్



కెరమెరి: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీవో



కౌటాల: దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్

కెరమెరి: తప్పులు లేకుండా దరఖాస్తులను పూరించి కౌంటర్లలో ఇవ్వాలని ఎంపీడీవో మహేందర్ అన్నారు. శనివారం మండలంలోని మోడి, ఝరి, బాబేఝరి, జోడేఘాట్ గ్రామాల్లో ప్రజాపాలన కొనసాగింది. నాలుగు గ్రామ పంచాయతీల్లో మూడో రోజు 332 దరఖాస్తులు అందాయి. ఎంపీపీ మోతీరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి, డిప్యూటీ తహసీల్దార్ రాజలింగు, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య తదితరులు ఉన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లి, కొత్తసారసాల, జగన్నాథ్‌పూర్, బోడపల్లి గ్రామపంచాయతీల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. రాస్పెల్లి, కొత్తసారసాల గ్రామాల్లో తహసీల్దార్ కిరణ్‌కుమార్, జగన్నాథ్‌పూర్, బోడపల్లి గ్రామపంచాయతీల్లో ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్ దరఖాస్తులను స్వీకరించారు. ఎంపీవో గౌరీశంకర్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని రైతువేదికతో పాటు మండలంలోని గ్రామాల్లో శనివారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులను స్వీకరించారు. మండల ప్రత్యేక అధికారి సురేశ్‌బాబు ఆధ్వర్యంలో దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో మహేందర్, ఈవో కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. శనివారం చోర్పల్లి, తుంపెల్లి గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఎంపీడీవో శశికళలతో కలిసి పరిశీలించారు. సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, డీటీ పోచ్చయ్య, ఎంపీవో ప్రసాద్, ఏపీవో చంద్రశేఖర్, నాయకులు చిట్ల నారాయణ, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: ఆరు గ్యారెంటీల అమలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మూడో రోజు శనివారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి మొగడ్‌దగడ్, తాటిపల్లి గ్రామ పంచాయతీల్లో, ఎంపీడీవో నస్రుల్లాఖాన్ శీర్షా, గుడ్లబోరి గ్రామాల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండలంలోని కనికి గ్రామంలో ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ దరఖాస్తుల ప్రక్రియ పరిశీలించారు.

దహెగాం: ఆరు గ్యారెంటీల పథకాల దరఖాస్తుల స్వీకరణ కోసం చేపట్టిన ప్రజాపాలన గ్రామసభల కార్యక్రమం మండలంలో కొనసాగుతోంది. శనివారం మండలంలోని ఒడ్డుగూడ, చినరాస్పెల్లి, ఇట్యాల, బొర్లకుంట గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. తహసీల్దార్ కవిత మాట్లాడుతూ ప్రజాపాలనలో ఐదు గ్యారంటీల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

రెబ్బెన: ప్రజాపాలన సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ అన్నారు. శనివారం మండలంలోని నంబాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. గోలేటిలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్ పరిశీలించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ సోమశేఖర్, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ సమీర్ పాల్గొన్నారు.

దరఖాస్తులను విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలి

మండలంలో ప్రజాపాలన దరఖాస్తులను విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ మండల సహాయ కార్యదర్శి చాపిడి పురుషోత్తం డిమాండ్ చేశారు.

నూతన సంవత్సర వేడుకలు

రెబ్బెన: మండలంలోని లేతన్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. గడిచిన సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. హెచ్ఎం రవికుమార్ ఉన్నారు.

పదవీ విరమణ కార్మికుడికి సన్మానం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో ఈపీ వెల్డర్‌గా విధులు నిర్వహించి శనివారం పదవీ విరమణ పొందిన అమ్జదుల్లాఖాన్‌ను ఓసీపీ అధికారులు, తోటి కార్మికులు ఘనంగా సన్మానించారు. ఖైరిగూడ ప్రాజెక్టు అధికారి నాయని ఉమాకాంత్ హాజరై అమ్జదుల్లాఖాన్ దంపతులను సన్మానించారు. మేనేజర్ ప్రవీణ్ ఫటింగ్, ఏఐటీయూసీ నాయకులు మారం శ్రీనివాస్, రెహమాన్, వెల్ఫేర్ అధికారి వేణు పాల్గొన్నారు.

వాతావరణ పరిరక్షణ మొక్కలతోనే సాధ్యం

జన్నారం: వాతావరణంలో పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించి, వాతావరణ పరిరక్షణ కేవలం మొక్కలతోనే సాధ్యమని రేంజ్ అధికారి హఫీజోద్దీన్ అన్నారు. మండలంలోని కలమడుగు వివేకానంద పాఠశాలలో శనివారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు.